క్లుప్తంగా

కాకుటూరులో కాకాణి ఎన్నికల ప్రచారం నేడు

వెంకటాచలం : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం కాకుటూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య సోమవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు గ్రామానికి చేరుకుని ప్రతి కాలనీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

మనుబోలు : మండలంలోని కొమ్మలపూడి క్రాస్ రోడ్డు వద్ద తాటిపర్తి వెంకయ్య అనే వ్యక్తి నుంచి ఆరు ఫుల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ కొమ్మలపూడి రోడ్డు వద్ద ఓ వ్యక్తి పరిమితికి మించి మద్యం తీసుకెళ్తున్నాడనే సమాచారంతో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వెంకయ్యను అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 6 ఫుల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలియజేశారు.

ఉగాదిని సంతోషంగా జరుపుకోవాలి

• ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : తెలుగు సంవత్సరాది క్రోధినామ సంవత్సర ఉగాదిని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఉగాది పండగ తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపంగా నిలుస్తుందన్నారు.

రెడ్‌క్రాస్‌లో ముందస్తు ఉగాది సంబరాలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో ముందస్తు ఉగాది సంబరాలను సోమవారం నిర్వహించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ఆదేశాల మేరకు ఐఆర్సీఎస్, ఎమ్మెస్సార్ స్పాస్టిక్ సెంటర్‌లలో రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారుల సమక్షంలో ఉగాది సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీక్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపల్ గురునాథరావు, సభ్యులు అరుణమ్మ, వైస్‌ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి, నవీద్‌అక్తర్, నవీన్, రెడ్‌క్రాస్ సిబ్బంది, మానసిక దివ్యాంగులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

కృత్రిమంగా పండ్లను మగ్గబెడితే చర్యలు



పండ్ల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎంహెచ్‌ఓ వెంకటరమణ

నెల్లూరు(బారకాసు): కృత్రిమ పద్ధతుల్లో పండ్లను మగ్గబెట్టి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ హెల్త్‌ఆఫీసర్ వెంకటరమణ హెచ్చరించారు. చిన్నబజారులోని పండ్ల మార్కెట్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో కార్బైడ్‌ను వినియోగించి కృత్రిమంగా మామిడి, అరటి పండ్లను మగ్గబెట్టడాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని నోటీసులు జారీ చేశారు. పండ్లు తీపి, రంగు వచ్చేందుకు వినియోగిస్తున్న వివిధ రసాయనాలను గుర్తించి దుకాణాల యజమానులకు జరిమానాలు విధించారు. అసహజ పద్ధతుల్లో పండ్లను తయారు చేయడం, ఆహారాన్ని కల్తీ చేయడం, విక్రయించడం చట్టవ్యతిరేకమైన చర్యలని తెలిపారు. పండ్ల దుకాణాల అసోసియేషన్ సభ్యులు సహకరించి తమ సమాచారం అందించాలని, నిబంధనలు ఉల్లంఘించే విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కార్పొరేషన్ నిబంధనలు పాటించాలి

నెల్లూరు(బారకాసు): ప్రజారోగ్య పరిరక్షణకు కార్పొరేషన్ సూచించిన నిబంధనలను వ్యాపార అనుమతులు పొందిన ప్రతిఒక్కరూ విధిగా పాటించాలని ఎంహెచ్‌ఓ వెంకటరమణ సూచించారు. అల్లీపురంలోని ఐస్‌బర్గ్ ఆర్గానిక్ ఐస్‌క్రీమ్ తయారీ యూనిట్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్‌లు, ఎన్‌ఓసీ సర్టిఫికెట్లు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ, తదితర అంశాలను ఆయా ప్రాంగణాల్లో పరిశీలించి మరింత మెరుగుపరచాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం కార్పొరేషన్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న గుడపల్లిపాడులోని చైతన్య స్కూల్‌ను పరిశీలించారు. సౌకర్యాలు పూర్తిగా కల్పించిన తరువాత మరోసారి తనిఖీ చేసి అనుమతులు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు.

అడుగడుగునా బ్రహ్మరథం



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎంపీ విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



ర్యాలీగా తరలివస్తున్న ప్రజలు, నాయకులు

• జనసంద్రంగా విడవలూరు

విడవలూరు : వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేణుంబాక విజయసాయిరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మండల పరిధిలో సోమవారం చేపట్టిన ఎన్నికల ప్రచారం అట్టహాసంగా సాగింది. అడుగడుగున ప్రజలు వారికి ఘన స్వాగతం పలికారు. తొలుత వైఎస్సార్‌సీపీ నేతలు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, కాటంరెడ్డి నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్లపల్లి గ్రామం నుంచి విడవలూరు వరకు 300 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విడవలూరు సినిమాహాల్ సెంటర్ వద్దకు చేరుకున్న ప్రసన్నకుమార్‌రెడ్డి, విజయసాయిరెడ్డికి ప్రజలు గుమ్మడికాయలతో దిష్టి తీసి, హారతులతో స్వాగతం చెప్పారు. అనంతరం కిలోమీటర్ మేర సాగిన ప్రచార యాత్రలో ప్రజలు అడుగడుగునా మేళతాళాలు, కోలాటాలు, పువ్వుల వర్షంతో బ్రహ్మరథం పట్టారు. అనంతరం విడవలూరు గ్రామదేవత అంకమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులై మండలంలోని విడవలూరు, కొత్తూరు గ్రామాల నుంచి 60 కుటుంబాలు టీడీపీ, జనసేన పార్టీలను వీడి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తానని, పార్టీ గెలుపు కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కోవూరు యువజన విభాగ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కొండూరు వెంకటసుబ్బారెడ్డి, సురేంద్రరెడ్డి, మురళి, తిరుపతయ్య, చంద్రశేఖర్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'హామీలన్నీ నెరవేర్చాం'

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కోవెరపాళెంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : '2019 ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాం, మరో అవకాశమిస్తే మరింత మేలు చేకూరేలా పాలన సాగిస్తాం' అని వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పేడూరు, కోవెరపాళెం, పాపిరెడ్డిపాళెం పంచాయతీల్లో ఆయన సోమవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముందుగా పేడూరులో మంత్రి కాకాణికి స్థానిక పార్టీ కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం కోవెరపాళెంలో, పాపిరెడ్డిపాళెంలో కూడా మంత్రి కాకాణికి స్థానికులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలిచ్చి ఒక్కటీ సరిగ్గా నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. చెప్పి ఎగ్గొట్టిన చరిత్ర చంద్రబాబుది అయితే చెప్పిన దాని కంటే మిన్నగా పాలన చేసి చూపిన చరిత్ర సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదన్నారు. రైతులకు సంబంధించి విడతల వారీగా రూ.13,500ల చొప్పున రూ.67,500లను అందించి రైతులను ఆదుకున్నారని, అలాగే పొదుపు మహిళలకు నాలుగు విడతల్లో పూర్తిగా రుణమాఫీ చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయని, 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గాన్ని తన శక్తి మేర అభివృద్ధి చేసి చూపినట్లు మంత్రి కాకాణి చెప్పారు. ఎన్నికల సమయంలో మాత్రమే దర్శనమిచ్చే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని నమ్మి మోసపోవద్దని కోరారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు, పార్టీ నాయకులు తిక్కవరపు సనత్‌రెడ్డి, తూపిలి ఉదయ్‌రెడ్డి, తిరువళ్లూరు ఈశ్వరయ్య, కదురు సుబ్బయ్య, దద్దోలు వెంకటకృష్ణయ్య, తిరువళ్లూరు వెంకటేశ్వర్లు, శివయ్య, లక్ష్మణ్, రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



వెంకటాచలం: వైఎస్సార్‌సీపీలో చేరిన చవటపాళెం వాసులు



వెంకటాచలం: వైఎస్సార్‌సీపీలో చేరిన కనుపూరు వాసులు

వెంకటాచలం: మండలంలోని కనుపూరులో 30 కుటుంబాలు, చవటపాళెం గ్రామంలో 12 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ మేరకు వారు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తాము లబ్ధి పొందామని, కృతజ్ఞతగా వైఎస్సార్‌సీపీలో చేరాలని నిర్ణయించుకున్నామని కాకాణికి చెప్పారు. దీంతో ఆయన వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చవటపాళెం గ్రామం గత ఎన్నికల వరకు టీడీపీకి కంచుకోట అనే పేరు ఉండేది. అయితే 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలవడం, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చవటపాళెం అభివృద్ధికి కోట్లాది నిధులు వెచ్చించడంతో చవటపాళెంలో వైఎస్సార్‌సీపీ బలోపేతమైంది. దీంతో వలసలు కొనసాగుతున్నాయి. రాబోయే ఎన్నికల్లో చవటపాళెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మెజారిటీ సాధించడం ఖాయమని గ్రామ ప్రజలు చెబుతున్నారు.



తోటపల్లిగూడూరు : వైఎస్సార్‌సీపీలో చేరిన కృష్ణారెడ్డిపాళెం వాసులు

కనుపూరు గ్రామంలో 30 కుటుంబాలు టీడీపీని వీడటంతో ఆ పార్టీ బలహీనపడిందని సొంత పార్టీ నేతలే చెబుతున్నారు.

• తోటపల్లిగూడూరు : పేడూరు పంచాయతీ కృష్ణారెడ్డిపాళేనికి చెందిన టీడీపీ ముఖ్య నేతలు షరీఫ్, అమీర్‌బాషా, వారి కుటుంబ సభ్యులు మంత్రి కాకాణి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వీరికి మంత్రి కాకాణి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

సంక్షేమ పాలనకు ఆకర్షితులై..

నెల్లూరు(దర్గామిట్ట) : వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనకు ఆకర్షితులై కోవూరు నియోజకవర్గం ఇందుకూరుపేట మండలం కుడితిపాళేనికి చెందిన 100 మందికిపైగా టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. జొన్నవాడ ఆలయ చైర్మన్ మావులూరి శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బట్టిపాటి నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి నెల్లూరులోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎంపీ విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్న



కండలేరు ఒడ్డున వెలసిన సంగమేశ్వరాలయం



రథాన్ని భుజాలపై మోస్తున్న భక్తులు(ఫైల్)

ప్రసిద్ధ శైవక్షేత్రం.. సంగమేశ్వరాలయం

• నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

మనుబోలు : మండలంలోని బద్దెవోలు రోడ్డు పక్కన కండలేరు ఒడ్డున వెలసిన కామాక్షితాయి సమేత సంగమేశ్వరాలయం జిల్లాలో ప్రసిద్ధ శైవక్షేత్రంగా వెలుగొందుతోంది. ప్రతి ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాలు మంగళవారం ధ్వజారోహణతో ప్రారంభమవుతుంది.

ఆలయ ప్రాశస్త్యం

ఈ ఆలయానికి సంబంధించి పెద్దలు ఈ విధంగా చెబుతారు.. పరశురాముడు తల్లిని సంహరించిన తరువాత పాప ప్రక్షాళన కోసం దేశంలో ఎన్నో శైవక్షేత్రాలను నిర్మించాడు. అయినప్పటికీ పాప పరిహారం జరగకపోవడంతో ఆయన తండ్రి, గురువు అయిన జమదగ్ని మహర్షి ఆజ్ఞ మేరకు చివరగా మనుబోలు సమీపంలోని కండలేరు ఒడ్డున సంగమేశ్వరాలయాన్ని నిర్మించారని ప్రతీతి. తూర్పు ముఖ ద్వారంతో ఉన్న ఈ ఆలయంలో ఇతర వాటికి భిన్నంగా వెలుపలకు వెళ్లే మార్గం దక్షిణం వైపు ఉంటుంది. వచ్చి వెళ్లే మార్గాలు వేరుగా ఉండడంతో ఆలయానికి వచ్చి వెళ్లే వారి పాపఫలాలు అక్కడే ఆగిపోతాయని భక్తుల నమ్మకం. సప్తముఖ శివలింగం ఇక్కడి ప్రత్యేకత.

తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు

ప్రతి ఏటా ఏప్రిల్ 9 నుంచి 17వ తేదీ వరకు సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను మనుబోలులో అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. 9న ధ్వజారోహణ, 10న సప్రోత్సవం, 11న రావణ సేవ, 12న నందిసేవ, 13న రథోత్సవం, 14న స్వామివారి కల్యాణం, 15న పారువేట, 16న వసంతోత్సవం, 17న ఏకాంత సేవలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

రథోత్సవం ఎంతో ప్రత్యేకం

13వ తేదీ అర్ధరాత్రి నిర్వహించే రథోత్సవం ఎంతో ప్రసిద్ధి చెందింది. సుమారు 30 అడుగుల ఎత్తున్న స్వామివారి రథాన్ని భక్తులు భుజాలపై మోసుకెళ్లడం ఇక్కడి ప్రత్యేకత. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివపార్వతుల విగ్రహాలను ఉంచిన స్వామివారి రథాన్ని 13వ తేదీ రాత్రి మనుబోలులోని శివాలయం నుంచి 5 కి.మీ దూరంలో కండలేరు ఒడ్డున ఉన్న కామాక్షి సమేత సంగమేశ్వరాలయానికి గ్రామస్తులు భుజాలపై మోసుకెళ్తారు. ఆపై 14న ఆలయంలో శివపార్వతుల కల్యాణం జరిపించి తిరిగి అదే రథంపై స్వామివారి దంపతులను ఆ రాత్రికి మనుబోలులోని శివాలయానికి మోసుకొస్తారు. రథోత్సవం, స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు దేశంలోని వివిధ నగరాలలో స్థిరపడిన స్థానికులతో పాటు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు తరలివస్తారు.

రెండో పంటకు సాగునీరు లేదు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : కనిగిరి రిజర్వాయర్ కింద రెండో పంట వరి సాగుకు నీరు అందించలేమని నీటి పారుదలశాఖ డీఈ మధు తెలిపారు. ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు రైతులు రెండో విడత పంటకు సిద్ధంగా ఉన్నట్లు తెలియవచ్చిందని, అయితే కనిగిరి రిజర్వాయర్‌లో తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపోతుందని చెప్పారు.

అప్రమత్తంగా ఉండాలి

• ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

వెంకటాచలం : ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వెంకటాచలం పోలీస్‌స్టేషన్, టోల్‌ప్లాజా వద్ద సోమవారం రాత్రి ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టుకు ఇరువైపులా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. మద్యం అక్రమ రవాణా, నగదు, ప్రలోభపరిచే వస్తువులు తరలించకుండా అరికట్టాలని ఆదేశించారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు.



వాహన పత్రాలు పరిశీలిస్తున్న ఎస్పీ

అభివృద్ధిని చూసి ఆదరించండి

• వైఎస్సార్‌సీపీ నేతల ముమ్మర ప్రచారం

పొదలకూరు : గడిచిన ఐదేళ్లలో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయని, దీనిని చూసి ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆదరించాలని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పేర్కొన్నారు. పట్టణంలోని పుట్టాయగుంట, బుడేసాహెబ్ వీధి, రామనగర్ మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో ఆమె సోమవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన తండ్రి స్థానికుడని, మీ ఇంటి బిడ్డగా ఆయనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో రూ.కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. పూజిత వెంట జెడ్పీటీసీ నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ సోమా అరుణ, ఎంపీటీసీలు జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యులు అనూరాధ, విజయలక్ష్మి, పద్మావతి, అంజాద్, నాయకులు సోమా భాస్కర్, వూకోటి లక్ష్మీనారాయణ, హేమంత్, ఎం.శివశంకర్, సోమా పెంచలయ్య, తమ్మల ప్రసాద్, ఎం.శేఖర్‌బాబు, ఎం.రమణారెడ్డి, డి.విజయ భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



పొదలకూరు : రామమందిరం వీధిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న పూజిత

తాటిపర్తిలో..

మండలంలోని తాటిపర్తి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను తెలియజేసే కరపత్రాలను పార్టీ నాయకుడు పామూరు లచ్చారెడ్డి ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పి.నారాయణ రెడ్డి, సీహెచ్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

కొడవలూరు : పేదలకు అండగా నిలిచేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్కటేనని విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని యల్లాయపాళెం మజరా రామాపురంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం కోసం ఇంటింటి ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం లేని రాష్ట్రాన్ని చూడాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. అందువల్లే పేదలకు ఆర్థిక వనరులను అందించి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. పేదరికం లేని సుభిక్షమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ వర్ధిల్లాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్కే మహబూబ్ బాషా, సమీ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : తాటిపర్తి గ్రామంలో..



కొడవలూరు : రామాపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని పద్మావతినగర్ సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా షిర్డీ సంప్రదాయరీతిలో ఏడు రోజుల పాటు నిర్విరామంగా రేయింబవళ్లు నిర్వహించే అఖండ సాయినామ సంకీర్తన సప్తాహ మహాయజ్ఞాన్ని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి ఉదయం 6గంటలకు 'అఖండ జ్యోతిప్రజ్వలన' చేసి ప్రారంభించారు. తొలిరోజు సాయినాథుడు విశేషపుష్పాలంకరణలో భక్తులకు నయనానందకరంగా దర్శనమిచ్చారు. ఉభయకర్తగా నెల్లూరు వెంకటసుబ్బారెడ్డి వ్యవహరించారు. ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా షిర్డీ సంప్రదాయరీతిలో ఉదయం విష్ణుసహస్రనామ సామూహిక పారాయణం, సాయంత్రం 6గంటలకు శ్రీసాయినాథుని దివ్యరథోత్సవం, వెండి పల్లకి సేవ, ముస్లింల గంధోత్సవం (ఉరుసు), జెండా ఉత్సవం నిర్వహించనున్నట్లు మధుసాయి తెలిపారు. నగరోత్సవం సాయిదర్బార్ అద్దాల మందిరం నుంచి బయలుదేరి ఏసీనగర్ వరకు సాగుతుందని వివరించారు. ఈ నెల 18న ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు సాయిసచ్చరిత్ర పారాయణం నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు విశేషంగా పాల్గొని సీతారామలక్ష్మణహనుమంతులతో పాటు సాయిబాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.



విశేషాలంకారంలో సాయినాథుడు

వాకర్స్‌కు వైద్యపరీక్షలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజిన్ రామానాయుడు సౌజన్యంతో వాకర్స్‌కు ఉచిత మెడికల్ క్యాంప్‌ను సోమవారం నిర్వహించారు. 300 మంది వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి గుర్రం సురేంద్రబాబు మాట్లాడుతూ దాతలు, అసోసియేషన్ సభ్యుల సహకారంతో గత 20 ఏళ్లుగా ప్రతి నెలా మొదటివారం వాకర్స్‌కు ఉచితంగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి అనంతరామారావు, కోశాధికారి అరిగెల సాయిరామ్, మాజీ అధ్యక్షుడు బాసం శేషగిరిరావు, కిలారి తిరుపతినాయుడు, కనకట్ల రఘురామ్‌ముదిరాజ్, వేలూరు రంగారావు తదితరులు పాల్గొన్నారు.